


# నిదురించే తోటలోకి

## - మన్నెం శారద



(గత సంచిక తరువాయి)

**సరోజని ఏదో** చెప్పబోతుండగా దూరంగా వస్తున్న రాజీని గమనించింది రామలక్ష్మి.

"రాజీ వస్తున్నదక్క!" అంది గుసగుసగా.

"అత్తా" అంది వస్తూనే రాజీ సరోజని వైపు చూసి.

"నువ్వా రాజీ! రా!" అంది సరోజని చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"తమ్ముణ్ణి పెళ్ళికొడుకుని చేస్తున్నారక్కా" అంది రాజీ మెల్లిగా.

సరోజని మాట్లాడలేదు.

"నిన్ను పిలవలేదని ఏమీ అనుకోకు. నాన్న చాలా గట్టిగా చెప్పాడు నిన్ను పిలవడానికి వీల్లేదని" అంది రాజీ హీన స్వరాన.

సరోజని నవ్వింది. "పర్లేదు. ఇంకా నన్ను పిలవమన్నాడంటే ఆశ్చర్యపోవాలి. అయినే నేను రానే" అంది.

"తమ్ముడదోలా ఉన్నాడు. ఎవరితో మాట్లాడటంలేదు" అంది దిగులుగా.

సరోజని అలాగే చూస్తూ కూర్చుంది.

"అత్తా!"

"ఊ"

"ఆ అమ్మాయి... ఆ అమ్మాయి ఏవయ్యింది? తమ్ముడు ఈ పెళ్ళికి ఎందుకొప్పుకున్నాడు. నాకు చాలా దిగాలుగా ఉంది" అంది రాజీ బాధగా.

"నీ బాబునడగలేకపోయావా?"

సరోజని మాటకి తెల్లబోయినట్లుగా చూసింది రాజీ.

"అవునే. జవాబు చెప్పాల్సింది నీ బాబే! నేను కాదు"

"ఏమడుగుతాం అత్తా! మాట్లాడితే తాడొకటి తీసుకుని ఉరేసుకుంటానని బెదిరిస్తున్నాడు."

"అదేపని ఆ పిల్ల యింటికెళ్ళి చేసొచ్చాడు. ఆ పిల్ల అడ్రెస్ లేకుండా సొంత కొంపాదిలి ఎల్లిపోయింది. చేసుకోనీ! ఎవర్తో ఒకర్తి ఉండాలిగా జీవితం ఎల్లబోసుకోటానికి" అంది సరోజని నిర్లిప్తంగా.

"అత్తా.. నువ్వే ఇలా.."

"ఇంకెలా మాట్లాడానే. ఛీ! అన్నా ఛ అన్నా మీ కొంప పట్టుకుని ఏలాడాను. ఆడికి మంచి జరగాలని ఎంతో తాపత్రయపడ్డాను. కన్నతండ్రే కాటికి కట్టెలు పేరుస్తుంటే కాదనే వాడెవడే ఈ పాడులోకంలో యిలాంటోళ్ళు కూడా ఉంటారు" అంది సరోజని ఉక్రోషంగా.

రాజీ మాట్లాడలేకపోయింది.

"మరి తమ్ముడు...?"

సర్దుకుంటాడులే. అమ్మపోతే ఏవయ్యాడు. అంత ఉప్పెనొచ్చి ఊళ్ళూళ్ళూ పోతే తిరిగి బతికినోళ్ళు బట్టకట్టలే! అంతే.. ఎంతసేపూ మీ తమ్ముడే అంటున్నావు. అవతలా పిల్లేవయిందో మీరు ఆలోచిస్తున్నారా?"

సరోజని మాటలకి తలదించుకుంది రాజీ.

"అద్సరే! పెళ్ళి ఝూమ్మని ఆ బంగళాలో చేస్తానన్నాడుగా. అక్కడేనా?" అంది సరోజని.

"లేదత్తా! అదంతా పాడుబడి వుంది. దానికి రంగులేయాలంటేనే లక్షలవుతుంది. దానికి తోడు తమ్ముడు అందులో అడుగుపెట్టనన్నాడు" అంది రాజీ.

"సరే ఎల్లు మరి. మళ్ళీ యిక్కడికి రావడం చూస్తే ఈరంగమాడ్తాడు" అంది సరోజని.

రాజీ తలుపి వెళ్ళిపోయింది.

"అక్కా నువ్వు నిజంగానే పెళ్ళికెళ్ళవా?" అని అడిగింది రామలక్ష్మి రాజీ వెళ్ళగానే సరోజనిని.

"ఏ మొహం పెట్టుకునెళ్ళి వాడి మొహం చూడాలే. అద్సరేగాని ఎల్లి రెండు జతల బట్టలు సర్దుకుని అన్నవరమెళ్తావని నీ మొగుడికి చెప్పిరా! ఇక్కడుంటే పిచ్చెక్కిపోతున్నది" అంది సరోజని.

రామలక్ష్మి విస్తుపోతూ చూసి "నువ్వు దేవుడి గుడికా?" అంది.

"దేవుడి కోసం కాదులేవే! అక్కడికి కాకపోతే ఇంకెక్కడికి వెళ్తాం మనం. కాస్త ఈ స్థలం నాల్రోజులొదిలేయకపోతే పిచ్చిబట్టేట్టు ఉంది. ఎల్లు. ఎల్లి నీ మొగుడి పర్మిషన్ తీసుకో!" అంది సరోజని.

"ఆయనేం కాదంటాళ్ళే అక్కా! నువ్వు రమ్మనడవే గగనం. ఇప్పుడే వస్తా" అంటూ రివ్వున పరిగెత్తింది రామలక్ష్మి.

"మాయదారి సంత. మొగుడు మాట పెళ్ళావినేసినట్లు - పెళ్ళాలకి మొగుళ్ళు అడలి సచ్చినట్లు.. అన్నీ డ్రామా కంపెనీలు.." అనుకుంది స్వగతంలా తనూ లేచి తయారవ్వడానికి సిద్ధపడుతూ సరోజని.

ఆఫీసు నుండి వస్తునే కొన్ని ఆటవస్తువులు చిత్రకోసం తెచ్చింది వరూధిని.

స్నానం చేసి వచ్చి కూతురితో ఆడుకుంటున్న వరూధినికి కాఫీ, టిఫిన్ యిచ్చి "ఇందాకనే సుశీలాంటీ ఆఫీసు నుండి వచ్చారు" అంది.

"అవునమ్మా. రోజూ కాస్సేపు ఆఫీసుకి రమ్మన్నాను నేనే. కాసేపనుకున్నావిడ రోజంతా వుండిపోయారు కొత్త డిజైన్లవీ చూస్తూ" అంది వరూధిని టిఫిన్ తింటూ.

"మరి యిద్దరూ కలిసి ఆవిడ కారులోనే రావొచ్చుకదా! " తల్లి సందేహానికి చిన్నగా నవ్వింది వరూధిని.

"అది పద్ధతి కాదమ్మా. ఆమె నాకెంత చనువిచ్చినా ఆమె ఆ కంపెని ఓనర్. నేను నా లిమిట్స్ దాటకూడదు. ఈ వారం రోజుల్లో నేను చాలా గమనించాను. కొంతమంది స్టాఫ్ ఆమె కనుసన్నల్లో పడాలని తెగ ఆమె చుట్టూ తిరగడం - ఆమెని సందర్భం లేకుండా పొగడటం ఆమె అడక్కపోయినా అవీ ఇవీ అందించడం చాలా వెగటుగా వుంది చూస్తుంటే. "

"అవును. అయినా అలాంటి వాళ్ళవే రోజులు కదమ్మా. ఎంత మేధావులు కూడా పొగడ్తలకే పడతారు. చాడీలనే రుచిగా వింటారు. ఎదుటవారికి ఎంతో విజ్ఞతతో చెప్పేవాళ్ళు కూడా వీటికి బోల్తాపడి మంచివారిని దూరం చేసుకుంటారు. ఏం చేస్తాం. నల్లగిరితో నారాయణా!" అంది రాజేశ్వరి.

"సుశీలాంటి తెలివైందమ్మా. ఆమె నా ఛాంబర్‌లో వీటి గురించి తనే ప్రస్తావించారు. నాకు పని ముఖ్యం. వారిలో క్రమశిక్షణ ముఖ్యం. ఒకామె నా చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ పాదాలమీద ఉండేది. ఎప్పుడు చూసినా చాడీలే. నేను ఆమె స్వంతంలా అందరికీ చెప్పుకునేది. వెంటనే తీసేసాను" అని చెప్పారు. నేను నాకిచ్చిన వెహికల్లోనే వచ్చాను. ఎవరి స్థానంలో వాళ్ళుంటేనే విలువ" అంది వరూధిని.

రాజేశ్వరి కూతురివైపు అభినందనగా చూసింది.

ఈ పదిరోజుల్లో ఎంతో ఎదిగిపోయినట్లుగా అనిపించింది.

కొంతలో కొంత హేమంత్‌ని మరిచి మనిషిలా బ్రతకగలదని ఆశకలిగిందా తల్లిలో.

కాని... అందుకు విరుద్ధంగా వరూధిని రాత్రి వేళ చాలాసేపు మెలుకువగా వుంటుంది ఆలోచనలతో. వాటినిండా హేమంతే.

తనకి - అతనికి ఏదైనా మనస్పర్థ వచ్చి విడిపోతే అది వేరు.

కోపంతో దూరం కావచ్చు.

కానీ.. ఇది అది కాదే

ఎవరో తమని బలి తీసుకున్నారు.

హేమంత్ అందరిలాంటి మగవాడు కాదు. పూటకో వేషం వేసే అల్పుడు కాదు. తమ స్నేహం కొద్దిరోజులే కావొచ్చు. వాటి మధ్య నిజాయితీ వుంది. ఒకరిపట్ల ఒకరికి నమ్మకమూ, బాధ్యత వుంది. పరస్పర అవగాహన - పంచుకోవడం వుంది. వీటన్నిటి మధ్యా ఇరుక్కున్న తమ హృదయాలున్నాయి.

ఇదేవిటి.. ఇంత బలమైన బంధం... ఒక్క క్షణంలో ఇలా తెగిపోయిందేమిటి? ఇంత దూరాన్ని పెంచేసిందేమిటి?

అర్థంకాని బాధతో ఆమె హృదయం మెలిపెట్టినట్లవుతుంది. కన్నీరు తలగడలో ఇంకిపోతుంది.

ఎప్పటికో నిద్ర.

తెల్లవారుతూనే పరుగు.

అప్పుడే పండుగలూ పబ్బాలూ లేకపోవడంతో సత్రంలో గది తేలిగ్గానే దొరికింది సరోజనికి రామలక్ష్మికి.

ఇద్దరూ స్నానం చేసి ఒకసారి గుళ్ళో కెళ్ళొచ్చారు.

రామలక్ష్మి దేవుణ్ణి చూసి అదేపనిగా లెంపలు వాయించుకుంటుంటే "నాకు తెలియదుకాని అన్ని తప్పులు చేసేవేంటే?" అంది సరోజని నవ్వుతూ.

"ఊరుకో అక్కా... ఏదో ఒకటి తెలియక చేస్తాం కదా!" అంది రామలక్ష్మి.

"తెలియకేంలే. తెలిసే చేసేవ్. ఇప్పటికెన్నిగ్లాసుల పంచదార అప్పే నాకు? అదంతా చెప్పాయనకి" అంది సరోజని.

"పో అక్కా... నువ్వు మరీనీ!" అంది రామలక్ష్మి.

గుళ్ళోంచి బయటకొచ్చాక ఆ చుట్టూ పరిసరాలు పై నుండే చూసారు. ఆ కొండలు.. నది.. పచ్చదనం.. మనోహరంగా ఉందా ప్రాంతం.

ఏది చూస్తున్నా ఏం చేస్తున్నా కడుపులో ఏదో ఏసిడ్ తాగినట్లు గాభరాగానే వుంది సరోజనికి.

"పెళ్ళయిపోయి వుంటుందా? వాడిక నాగిని సొత్తయిపోయుంటాడా! ఆడి బతుకు మలుపు తిరిగిపోయిందా?" ఏదో వేదనతో కొట్టుకుపోతుందామె మనసు.

మూడురోజులూ మూడు యుగాల్లా గడిచిపోయాయి. వ్రతం చేద్దామన్నా ఒప్పుకోలేదు సరోజని.

"ఏం గనకార్యం జరిగిందని వ్రతాలు, నోములూ చెయ్యాలే. ఇంతింత కళ్ళెట్టుకు చూసేది అన్యాయాల్ని చూడమనా! ఏం దేవుళ్ళో. పద. పద" అంటూ లేవదీసింది సరోజని.

ఇద్దరూ.. తిరుగు ప్రయాణమయ్యారు చివరికి.

సుశీల వరూధినీని ఆఫీసుకెళ్ళనిచ్చి రాజేశ్వరి దగ్గరికి వచ్చింది.

రాజేశ్వరి ఆమెని ఆహ్వానించి కూర్చోపెట్టింది.

"మీ దయవల్ల నా కూతురిప్పుడిప్పుడే మనుషుల్లో పడుతున్నది. మీ మేలు మరచిపోలేను." అంది రాజేశ్వరి సుశీల చేతులు పట్టుకుని కన్నీళ్ళతో.

"అయ్యో, అంత మాటనకండి. నిజానికి నేనే వరూధినికి ఋణపడి ఉన్నాను." అంది సుశీల గద్గదస్వరంతో.

రాజేశ్వరి ఆవిడ వైపు ఆశ్చర్యంగా చూసింది.

"అవునండి. వరూధిని చాలా తెలివితేటలుగా నన్ను బిజీ చేసింది. ఇదివరకు ఇరవైనాలుగ్గంటలు నా కూతురి మరణం తలుచుకుని కుమిలిపోతుండేదాన్ని. ఇప్పుడు నన్ను ఆఫీసుకి రమ్మని కండిషన్ పెట్టింది. నాకుతెలియకుండానే నేనిప్పుడు ఫ్యాక్టరీ బాగోగులు చూసే పనిలో పడ్డాను. అక్కడ వ్యవహారాలన్నీ అర్థమవుతున్నాయి. ఎంతోమంది నిర్భాగ్యులకి ఉపాధి కల్పిస్తున్నానన్న నమ్మకం ఏర్పడింది. అది నాకు చాలా సంతృప్తినిస్తోంది" అంది సుశీల.

"నిజంగా చాలా సంతోషమండి" అంది రాజేశ్వరి.

"వరూధిని చాలా తెలివైన పిల్ల. ఆ అమ్మాయికి అడ్మినిస్రేటివ్ చాలా ఉంది. అందరూ తన అదుపులో కొచ్చేసారప్పుడే కాని.." అంటూ ఆగిందామె.

రాజేశ్వరి ఆందోళనగా చూసిందామె వైపు.

"ఇంత తెలివైన పిల్ల మమతనెలా నమ్మిందో?"

రాజేశ్వరి అర్థంకానట్లుగా చూసింది.

"మీ అమ్మాయి జీవితమిలా కావడానికి కారణం మమత. మీకా సంగతి తెలుసా? మమతే హేమంత్ తండ్రికి ఈ విషయం తెలియజేసి మీ ఇంటికి రప్పించింది. వాళ్ళిద్దర్నీ అకారణంగా నిర్దాక్షిణ్యంగా విడదీసింది. హేమంత్‌కి మీరిక కనబడకూడదని భయపెట్టి ఇక్కడికి తీసుకొచ్చేసింది."

సుశీల మాటలకి తెల్లబోయింది రాజేశ్వరి.

"అవును. నేను రెడ్ హేండెడ్‌గా పట్టుకుని నిలేసేసరికి నిజం ఒప్పుకుని ఏడ్చింది. అన్నం పెట్టిన చేతిని ఎలా కొరికేవ్, నీకు పుట్టగతులుంటాయా అని కేకలేసేసరికి భయపడి అంతా చెప్పేసింది. వెళ్ళి అంతా చెప్పి హేమంత్ ని తీసుకొస్తానంది. ఇప్పటివరకు అయిపులేదు. అసలెళ్ళిందో లేదో?" అంది సుశీల.

రాజేశ్వరి తేరుకోలేకపోయిందా సంగతులు విని.

"ఆ అమ్మాయికి ఆ బుద్ధి ఎందుకు పుట్టిందో.. చాలా విషయాల్లో ఆమెని ఆదుకున్నాం" అంది హీనస్వరాన కన్నీళ్ళతో రాజేశ్వరి.

సుశీల గాఢంగా నిట్టూర్చింది.

"హు! పెట్టిన చేతినే కదా. ఎవరైనా కొరకగలరు. అంతా మరచిపొండి. చూద్దాం. దేవుడు ఆడే నాటకం ఏ మలుపులు తిరుగుతుందో. ఈ సంగతులేమీ వరూధినికి చెప్పకండి. అంతా కెలికినట్లవుతుంది. ఇప్పుడిప్పుడే తను మనుషుల్లో పడుతున్నది" అంటూ బయల్దేరింది సుశీల.

వెళ్తున్న ఆమె వైపే నిస్తేజంగా చూస్తూ కూర్చుండిపోయింది రాజేశ్వరి.

సరోజని గుండెలరచేత్తో పట్టుకుని ఆటో దిగింది. దిగుతూనే "ఒసే రామలక్ష్మీ. ఇప్పుడే దిగగానే ఏం గోల అనుకోపోతే... కొంచెం ఆ సుందరం పీనుగ చూడకుండా రాజీని పిలుస్తావా!?" అంది.

"అయ్యో, అదేం భాగ్గవక్కా! నాక్కూడా హేమంత్ మీదే వుంది మనసు. ఇంటికెళ్ళి ఈ బాగ్ పడేసి వెళ్తా" అంటూ వెళ్ళిపోయింది రామలక్ష్మి.

సరోజని గబగబా స్నానం చేసి ఇంత కాఫీ కలుపుకుని రాజీ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

మరో అరగంటలో రాజీ, రామలక్ష్మి కలసి వచ్చారు.

"పెళ్ళయిపోయిందా?" అనడగలేక గుండె పట్టేస్తోంది సరోజనికి.

"దావే కూర్చో" అంది. సరోజని హీనస్వరాన.

రామలక్ష్మి "నేనొస్తానక్కా. ఇంట్లో ఎక్కడివక్కడే పడివున్నాయ్" అంటూ వెళ్ళిపోయింది.

సరోజని చిన్నగా రాజీవేపు చూసింది.

రాజీ గోడకి చేరబడి చేతిలో గీతలు గీసుకుంటూ మౌనంగా కూర్చుంది.

"ఏవే, నీ బాబు లేడా?" అనడిగింది.

"ఇంకా ఆ బిల్డింగ్‌కి తగలెట్టింది కట్టుకోవాలిగా లాయర్లకి. వసుంధరత్తతో కేరళ వెళ్ళాడు రాత్రే." అంది రాజేశ్వరి.

"మరి నాగిని...?"

"తనూ వెళ్ళింది.."

గుండె పట్టేసినట్లుంది సరోజనికి.

"మరీ.. వాడు..?"

"తమ్ముడా.. తమ్ముడు శ్రీకాకుళం వెళ్ళిపోయాడు. ఉన్న ఈ నాలుగురోజులూ ఒకటే ఫోన్లు - ఆఫీసునుండి. అర్జెంటు పనులట. సి.ఎమ్ టూరట"

ఇద్దరి మాటలూ గుంభనంగా సాగిపోతున్నాయి.

అసలు విషయం తెలియక ప్రాణం కొట్టుకుంటున్నది సరోజనికి.

అలాగే కూర్చుంది. అడిగితే ఏం వినాల్సి వస్తుందో అని!

"ఉండత్తా. నీకు కనీసం పెళ్ళి స్వీట్స్‌అన్నా పెడతాను. పెళ్ళి భోజనం ఎలాగూ తినలేదు నువ్వు"

అంతే!

తెలిసిన విషయమన్నా తలలో వెయ్యి విస్ఫోటనాలు జరిగినట్లయింది సరోజనికి. అలాగే నిస్సత్తువుగా కుర్చీలో జేరబడిపోయింది కన్నీళ్ళతో.

కాలం యాంత్రికంగా ముందుకి సాగిపోతోంది.

కనకారావు చనిపోయినప్పుడు కూడా ఇంతస్తబ్దత అనుభవించెరగదు తను.

హేమంత్ జీవితమింత విషాదం కావడం భరించలేక పోతోంది సరోజని.

ఒంటరితనం ఇప్పుడు బాగా తినేస్తోంది.

అప్పుడే ఒక ఆటో గుమ్మం దగ్గరగా ఆగింది.

అటుకేసి చూసింది సరోజని నిర్లిప్తంగా.

ఆటో డ్రైవరు దిగొచ్చి "ఇక్కడ సుందరంగారిల్లంట ఎక్కడో తెలుసా?" అనడిగాడు.

"వాడి బొంద మీద" అంది సరోజని అక్కసుగా.

డ్రైవరు బుర్రగోక్కుంటూ ఆటోలోకి చూశాడు.

"హేమంత్ అని అడుగు పోనీ"

ఆడగొంతు విని ఆసక్తిగా చూసింది సరోజని.

అందులో స్త్రీమూర్తి చిన్నగా నవ్వి ఆయనతో అర్జెంటు పని హైదరాబాదునుండొచ్చాను" అంది.

వెంటనే ఏదో స్ఫురించినట్లయి బయటకొచ్చి "ఇక్కడే దిగండి" అంది.

ఆవిడ మెల్లిగా ఆటో దిగింది. బాగ్ డ్రైవరు తెచ్చి వరండాలో పెట్టాడు.

సరోజని ఆమెని ఎగాదిగా చూసింది.

ఆమె కుడి చెయ్యి ముంజేతికి పెద్ద బాండేజ్ వుంది. మొహం నిండా ఎర్రబడ్డ గాయాలున్నాయి. ఆమె కుంటుకుంటూ వచ్చి "నా పేరు మమత. హేమంత్‌తో అర్జెంటుగా మాట్లాడాలి" అంది.

"లోపలికి రా ముందు" అంది సరోజని ఆమెని అనుమానంగా చూస్తూ.

మమత లోపలికొచ్చి కూర్చుంది.

సరోజని ఆమెకి మంచినీళ్ళిచ్చి "ఆడు మావోడే! ఇంతకీ ఏంటిపని?" అంది.

"నేను వరూధిని తరఫున వచ్చాను.

వరూధిని సంగతొకటి హేమంత్ గారికి చెప్పాలని.

పదిరోజుల క్రితమే రావాల్సింది. దారిలో బస్ ఏక్సిడెంటయింది. స్పృహలేదు. ఆస్పత్రిలో పడేసారు. ఈ ముంజెయ్యి పోయింది. వెంటనే దొరకలేదు. అందుకే.. " అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది మమత తలదించుకుని.

ఏదో అర్థమయీ అర్థమవుతున్నట్లుంది సరోజనికి.

దిగ్భ్రమగా చూసింది మమతవైపు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments